
# ఇల్లు

కథ

వేదప్రభాస్



సిమెంటు లోడు అన్ లోడింగు పూర్తయ్యింది.

బస్తాలు షెడ్డులో పెట్టించేక, కూలీలకు డబ్బిచ్చి పంపించి సీతారాముడు తెచ్చి వేసిన కుర్చీలో తీరుబాటుగా కూర్చున్నా. చాలా రాత్రే అయ్యింది. నల్లటి ఆకాశంలో నక్షత్రాలు తెల్లగా మెరుస్తున్నాయి. నెమ్మదిగా వీస్తున్న గాలికి పక్క ఇంటి కాంపౌండులో వున్న కొబ్బరిచెట్టు ఆకులు కదులుతూ సందడి చేస్తున్నాయి. నాలుగురోజుల నుంచి అదేపనిగా తిరుగుతున్న నాకు ఇప్పటికి కాసేపు ఊపిరి పీల్చుకునే వ్యవధి దొరికింది. రేపల్లా మళ్లీ ఊపిరాడనివ్వని పనే... అయినా పర్వాలేదు!

ఇంటికి స్లాబ్ పడిపోయేక మరి బాధ వుండదు. స్టీల్ కోసం, సిమెంటు కోసం ఈ నాలుగు రోజులూ చెత్త కుండీల దగ్గర పుల్లిరాకుల కోసం వెతుక్కుంటూ తిరిగే ఊరకుక్క కన్నా ఎక్కువగా తిరిగేను. కాంట్రాక్టర్ల చుట్టూ తిరిగి ఈసడింపులకీ, తిరస్కారాలకీ నొచ్చుకోకుండా నా పని జరిపించుకున్నాను. ఏదో ఒక రేటుకు కొనేయ్యాలనుకుంటే, అలా తిరగనక్కర్లేదు. కానీ నా తత్వం అది కానే కాదు.

కొంచెం గర్వంగా అనిపించింది. కుర్చీలో వెనక్కి చేరబడి సిగరెట్టు వెలిగించేను.

సీతారాముడు టార్చి వెలుతుర్లో దేనికోసమో వెతుకుతున్నాడు.

''ఏందది? సీతారావుడూ..!'' అని అడిగేను ఆరాగా.

''పొద్దుమీకి మేస్తుర్లు గంపేడ్నీ పారనూకిన్రు... దొర చూస్తున్న..''అన్నాడు సీతారాముడు.

''సక్కంగ చూడు... ఏ ఒక్కటి తక్వ అయినా, నీ పైసలకెల్లి పట్టుకుంట..'' బెదిరించేను వాడిని.

సీతారాముడు వెతకడంలో మునిగిపోయాడు. వాడు నమ్మకమైన మనిషే...! అయినా నాకు జాగ్రత్తెక్కువ. నేనుచిన్నప్పటినుంచి స్వయంకృషితోనే పైకొచ్చేను. హాస్టళ్లలో చాలీ చాలని తిండి తింటూ గవర్నమెంటు ఇచ్చే స్కాలర్‌షిప్‌తో పిజి పూర్తి చేసేను. అప్పటికీ నాకు ఈలోకంలో బతకడానికి ఎలాంటి తెలివితేటలు కావాలో అలాటివన్నీ పూర్తిగా అబ్బేయి, అందుకే జీతం ఎక్కువే అయినా వయస్సు పెరిగినా మీసాలు, గడ్డమూ పెరగని పేదవాడి మూతిలాంటి ఉద్యోగం ఒకటి వస్తే, దాన్నొదిలేసి, జీతం తక్కువ అయినా హోదా, ఇబ్బడి ముబ్బడిగా ఆదాయమూ వచ్చే డిపార్టుమెంటు ఉద్యోగంలో చేరిపోయాను.

అంతలా కష్టపడి నేను పైకొస్తే ప్రతి అడ్డగాడిదా మా అమ్మా, నాన్నలతో ఇన్నాళ్లకి మీ కష్టాలు ఫలించేయి అంటుంటే నాకు మండిపోయేది. మా నాన్న కూడా నల్లగా వున్న మొహంలో తెల్లటి మీసాల మీద అలాంటప్పుడు చెయ్యివేసుకోవడం చూసేసరికి నాకు అరికాలి మంట నెత్తికెక్కిపోయేది.

పెళ్లి విషయంలో కూడా నేననుకున్నట్టే చేసేను. సుజాత అంటే నాకిష్టం లేక కాదు. తనంటే నాకిప్పటికీ ఇష్టమే. కానీ పెళ్లి మాట వేరు కదా! సుజాతకి పెద్ద చదువూ లేదు. వాళ్ల నాన్న నాకు కావలసిన కట్నమూ ఇవ్వలేడు. స్వంత మామయ్యే కానీ. మన కత్తే కదా అని నేను నా పీక తెగ్గొట్టుకోలేను. అప్పటికే అహల్యతో పరిచయమైంది. నాకు తనూ నాలాంటి భావాలున్న మనిషే. చదువుకుని మంచి ఉద్యోగంలో వుంది. అందువల్లనే అందం లేకపోయినా తననే చేసుకున్నాను. అందువల్ల నాకింత వరకూ నష్టమేమీ జరగలేదు. ఈ ఇంటి విషయంలోనే ఆమె నన్ను వ్యతిరేకిస్తోంది. ఐనా నేనేం చేయడం లేదు. రేను స్లాబ్ పడిపోతే ఇంటిపని చాలా వరకు పూర్తయినట్లే.

సీతారాముడు వచ్చి నా కుర్చీ పక్కనే నేల మీద చతికిలబడి కూర్చున్నాడు.

''ఐతే.. దొరా.. రేపు పొద్దుగాల్నే స్లాబు షురూ ఐతదా..?'' అనడిగేడు.

''మరి. ! కాకుంటే ఈ గుంజాయిషీ అంత దేని కనుకున్నావు.. నువ్వు మాత్రం డ్రమ్ముల్ల నీరు నింపి పెట్టాలె.. ఏడికీ పోవద్దు. సైట్లనే వుండాలె.. మస్తు పనుంటది.. రేపు.. సమజయిందా?'' జాగ్రత్తలు చెప్పేను వాడికి, వాడు తలూపటం చీకట్లోనే అయినా స్పష్టంగా కనిపించింది.

''సిమెంటు షెడ్డు తాళం వేసిన వారె..?'' అనుమానం కలిగింది నాకు.

''ఇంతకుముందే మా ఏసిన దొరా..!'' మొల్లోంచి వెతికి తాళంచెవి తీసి నా వంక చూపుతూ జవాబిచ్చేడు సీతారాముడు టార్చి వెలిగించి చూసి'' అదిటుతే..!'' అని తాళంచెవి అడిగి తీసుకుని జేబులో వేసుకున్నాను

సీతారాముడి వైపు నిశ్శబ్దం గడ్డ కట్టింది. వాడికి నా చర్య పజిల్ కావచ్చు. ఏనాడు తాళంచెవి అడిగి తీసుకోని నేను, ఈ రోజు అడిగి మరీ తీసుకోవడం వాడికి ఆశ్చర్యం కలిగి ఉండొచ్చు. కానీ నేను ఒకటికి పది జాగ్రత్తలు తీసుకునే మనిషిని. స్టోర్ షెడ్‌లో ఉన్న సిమెంటూ, పై అంతస్థు కోసం ఉంచిన స్టీలూ, తక్కువ ఖరీదేం కాదు మరి...!

పట్టణంలో ఇల్లు కట్టుకోవాలంటే నమ్మకమైన మనిషి దొరకాలి ముందు. మేమిద్దరం ఉద్యోగస్తులం కావడం వల్ల కన్‌స్ట్రక్షన్‌కి కావాల్సిన ఏర్పాట్లయితే చెయ్యగలం కానీ, పని వాళ్ళ దగ్గర హాజరుగా వుండే మనిషాకరు చాలా అవసరం. ఊర్నించి మా వాళ్లెవరినైనా తేవాలంటే, నా మాటెలా ఉన్నా అహల్యతో చాలా సమస్యలొస్తాయి. అందుకే ఆలోచించేక ఎందరో చేస్తున్న పనే చేసేను.

ఇల్లు కట్టుకోవటానికి జాగా కొనుక్కోగానే, చాలా మంది వాళ్ళనీ, వీళ్ళనీ అడిగి నమ్మకస్తులైన వాళ్ళని ఆ జాగాలో ఇల్లు పూర్తయ్యేంత వరకూ ఉండేలా జీతానికి కుదుర్చుకుంటారు. కబ్జాల నుండి రక్షణ కూడా ఉంటుందన్నది కూడా మరో కారణం. నెల జీతాల మీద అలా పని చేసేందుకు సిద్ధంగా ఉండే వాళ్ళూ దొరుకుతారు. కుటుంబంతో సహా ఆ జాగాల్లో ఉండే వాళ్ళూ, ఒంటరిగా ఉండే వాళ్ళూ కూడా ఉంటారు.

హుజురాబాద్‌లో ఉండే సీతారాముణ్ణి నేను మా ఆఫీసుకు తరుచుగా వచ్చే ఓ పార్టీ ద్వారా కుదుర్చుకున్నాను. నాలుగు నెలల నుండి నమ్మకంగా పని చేస్తున్న సీతారాముడి వల్ల నాకు చాలా పని భారం తగ్గింది. పునాదులు తవ్వటం దగ్గర్నుండీ, శ్లాబ్ లెవల్ వరకూ పని చకాచకా నడవటానికి వాడే కారణం. వాడికి నేనిచ్చే జీతం కూడా తక్కువే...

నేను లేచి బైక్ వైపు నడిచేను.

నా వెనకాలే చేతులు కట్టుకుని సీతారాముడు. వాడేం అడగుతాడో నాకు తెలుసు. నెల్లాళ్ళ క్రితం నుంచి అదే పాట పాడుతున్నాడు.. వాడి చెల్లికో, అక్కకో పెళ్లి కుదిరిందట.. నేనో ఐదువేల రుపాయలు వాడికిచ్చి వాడి జీతంలో పట్టుకోవాలిట. నెలో , రెండు నెలల్లోనో వాడి అవసరం నాకు తీరి పోతుంటే, అంత డబ్బు నేనెలాగా వాడి చేతిలో పోసేది.. అందుకే ఔననీ, కాదనీ చెప్పకుండా దాటేస్తూ వస్తున్నాను.

నేను బైక్ స్టార్ట్ చెయ్యబోతుండగా, ''దొరా..'' అన్నాడు నెమ్మదిగా సీతారాముడు.

నేను మొహం గంభీరంగా పెట్టేను. జేబులు వెతికి నూర్రూపాయల నోటూ పైకి తీసేను. టార్చిలైటు వెలుగులో కనబడేలా పట్టుకుని, దాన్ని సీతారాముడికిచ్చేను. ''ఈ పైసలు జాగ్రత్త..! నేను వచ్చే దాన్కి ముందుగనే లేబరు పన్లకస్తరు.. వాండ్లకు చాతాపించేంద్కు ఈ పైసలు... మేస్త్రీకి చెప్పు దొరిచ్చిండని.''

''గట్లనే'' అని తలూపేడు సీతారాముడు ఆ నోటు బనీను జేబులో పెట్టుకుంటూ.

మరోసారి వాడికి మాట్లాడేందుకు అవకాశం రానియ్యకుండా నేను బైక్ ముందుకి కదిలించేను.

★★★

డ్రాయింగ్ హాల్లోని సోఫాలో అహల్య చెక్కిన రాతి బొమ్మలా కూర్చుని కళ్ళార్పకుండా టీ.వి. చూస్తోంది. నేను లోపలికి వచ్చి పక్కనే కూర్చున్నా, ఆమె తల కూడా తిప్పలేదు. ''అహల్య.. ఆకలేస్తోంది..'' మృదువుగా అన్నాను. ఆమె చలనం లేకుండా అలాగే కూర్చుంది. చేతివేళ్ళతో తన గడ్డం పట్టుకుని , నా వైపు తిప్పుకున్నాను.

''సారీ...లేటయిందిరా..శ్లాబ్‌కి కావాల్సిన ఏర్పాట్లు చేసి వచ్చేను.'' ఆమె చూపుల్లో కోపం కనిపించింది నాకు. అసహనంగా అనిపించినా, బయటికిప్రదర్శించలేకపోయేను.

అందువల్ల పరిస్థితి మరింత జటిలమవుతుంది మరి...రెండు నిముషాలు మౌనంగా గడిచేక, అంది అహల్య. ''నేను వొద్దన్నా వినకుండా మీ పన్లు మీరు చేస్తూనే ఉంటారు. హాయిగా బతక్కుండా లనవసరంగా అన్ని రకాలుగా నలిగిపోతారని నేను వద్దంటాను. టేబులు మీద మీ నాన్న ఉత్తరం ఉంది. చూడండి. మధ్యాహ్నం దిగబడింది''

ఉత్తరం అందుకుంటున్నపుడు నా నొసలు ముడుతలు పడింది. ఏం రాసి ఉంటాడు.. మా మీసాల ముసలాయన...?

ఇన్లాండు కవరంతా సెంటీమీటరు సందు లేకుండా గొలుసు కట్టు రాతతో నింపేడు నాన్న. చదవడానికి ఐదు నిముషాలు పట్టింది. దాన్నిండా ఉన్న జాగ్రత్తలూ, ఆశీర్వచనాలు, బంధుమిత్రుల క్షేమ సమాచారాలు తీసేస్తే, మిగిలిన సారాంశం చూసి, నాకు బాగా కోపం వచ్చింది.

''నేనేమో ఎంతో కష్టపడి, ఎన్నో ఇబ్బందులు పడుతూ, ఓ చిన్న గూడు కట్టుకోవాలని ప్రయత్నిస్తుంటే, ఇప్పుడాయనకు నేను డబ్బు సర్దాలిట.. చెల్లికి పెళ్లి హఠాత్తుగా కుదిరిందిట.. చాలా మంచి సంబంధం అట... అర్జెంటుగా పెళ్ళి చేసెయ్యమని అవతలి వాళ్ళు తొందర పెడుతున్నారట... ఓ లక్ష రూపాయలు నేను సర్దాలని ఆయన కోరుతున్నాడు.''

అహల్య కుతూహలంగా నా మొహం వంకే చూస్తోంది.

నేను పెదాలు బిగబట్టి, ఆమె ముందరే నాన్న

## ధోనీ పిచ్చిలో ఛార్మి

రోజురోజుకీ క్రికెట్ పిచ్చి బాగానే ముదిరిపోతోంది. తాజాగా టాలీవుడ్ అందాలభామ ఛార్మి వార్తల్లో వ్యక్తిగా మారిపోయింది. 'మంత్ర' విజయాన్ని పక్కన పెడితే ఛార్మి ఇప్పుడు ధనాధన్ ధోనీ అభిమానురాలైంది. ధోనీతో కలసి పనిచేయడానికి ఆమెకి ఎలాంటి అభ్యంతరం లేదంటోంది. వరుస ఆఫర్లతో బిజీగా ఉన్న ఈ భామ సెల్‌ఫోన్ కంపెనీలు, ఇతర కంపెనీలకు బ్రాండ్ అంబాసిడర్‌గా కన్పిస్తూ బాగానే సంపాదిస్తోంది. త్వరలో ధోనీతో కలిసి ఛార్మి ఏ యాడ్‌లో కన్పించినా ఆశ్చర్యపడనక్కర్లేదేమో!



రాసిన ఉత్తరాన్ని నాలుగుముక్కలుగా చించేను. నేను బాత్‌రూం లోకి వెళ్ళబోతుంటే, అహల్య నా చేయి పట్టుకుని ఆపి, అడిగింది. '' ఏం రాసేడు..? మీ.. ముసలాయన.. డబ్బేనా..?'' నాలో కసి పెరిగిపోయింది.

''కాదు, నా ప్రాణం..''అనేసి, విసురుగా బాత్రూంలోకి వెళ్ళిపోయేను. తలుపు వేసుకోబోయే ముందు యథాలాపంగా చూస్తే, అహల్య మొహానికి మేగజైన్ అడ్డంగా పెట్టుకోవడం కనిపించి, నా వొళ్ళు కోపంతో కంపించింది.

★★★

తెల్లవారుతూనే లేచి, తలకి స్నానం చేసి, దేవుడికి దణ్ణం పెట్టుకుని హడావుడిగా బయల్దేరి, కడుతున్న ఇంటి దగ్గరికి చేరుకున్నాను. దూరం నుంచి చూస్తేనే, ఎంతో హడావుడిగా ఉండాల్సిన సైటులో ఏ అలికిడీ కనిపించటం లేదు. నాకు హుస్సేన్ మీద చెప్పలేనంత కోపం వచ్చింది. అతను మాట ఇచ్చాకే ఈ రోజు శ్లాబ్ వేయటానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నాను. తీరా చూస్తే ఇంకా పని మొదలే కాలేదు.

మోటార్‌సైకిలాపి, స్టాండ్ వేసేను.

కూలీలున్నారు కానీ, వాళ్ళు చింతచెట్టు మీద కోలాహలంగా చప్పుడు చేసే కొంగల్లా కాకుండా, నీళ్లు రాని కొళాయిల ముందు బోర్లించిన బిందెల్లా గుంపులు, గుంపులుగా కూర్చుని వున్నారు. పెద్ద చప్పుడుతో తిరుగుతూ ఉండాల్సిన కాంక్రీటు మిక్సర్లు మూగ జంతువుల్లా నిలబడి పోయున్నాయి.

ఏం జరిగిందో నాకర్థం కాలేదు.

ఇంతలో నన్ను చూసినట్టున్నాడు... హుస్సేన్ భాయ్ నా వెనుక నుంచి ''సలాం... సాబ్..!'' అంటూ జర్దాపాన్ నములుతూ వచ్చేడు. నాకు చిరాకు కలిగింది. నోట్లో పాన్, చేతిలో సెల్‌ఫోన్‌లతో కనిపించే ఈ మేస్త్రీల్లాంటి వాళ్ళు పని చెయ్యగా నేనెప్పుడూ చూళ్ళేదు. కావాల్సినంత డబ్బు తీసుకోవడమే గానీ, పని సంగతి వీళ్ళకి పట్టదు. కనీస బాధ్యత కూడా వుండదు... నిజమైన ఎక్స్‌ప్లాయిటేషన్ వీళ్ళ దగ్గరే కనపడుతుంది.

''ఏమాయెనయ్యో..! ఇంత వరకు పన్లోకి దిగక పోతిరి.. ఇట్లయితె.. ఎట్ల'' నేను హుస్సేన్ పట్ల కొద్దిగా కోపం ప్రదర్శించేను.

''ఎట్ల చేయాలె.. సార్..! మాకు సిమెంటయితే ఇయ్యలె కద.. ఇచ్చేటోండ్లు లేకుంటే పని ఎట్ల చేసుడు..? ఇక్కడ్నే గింత లేటయితే మాకు మస్క కాదా.. లేబరుకు పైసలు గట్టుడు తప్పుతదా..! రెండుసార్లు ఇంటికి ఫోన్ చేస్తి. నీల్లు లేకపోయె.. అడిగితె చెప్పేటందుక్క ఒక్క మనిసైన లేకపోయె.. ఏం చేసుడు.. ఎట్ల జేసుడు.. సర్సరె.. జలీంద సిమెంటు వ్వని... ఔర మల్లేసం.. నలుగురు సార్తోని పోంద్రి..'' అని, ''కూసున్నది సాలు.. పని మీదికెక్కుద్రి'' అని లేబర్ని కేకేసేడతను.

నాకు సీతారాముడి మీద వళ్ళు తెలీని కోపం వచ్చింది.

''సీతారాముడు లేడా..?'' అనడిగేను, హుస్సేన్ చేతిలో సిమెంటు షెడ్డు తాళం పెడుతూ... ''సీతారాముడా..? సీతారాముడంటే..'' అర్థం కానట్టుగా అడిగేడతను. అప్పుడప్పుడు మాత్రమే వచ్చే హుస్సేనుకి సీతారాముడు వెంటనే తెలియక పోవడం పెద్ద ఆశ్చర్యమేం కాదు..

నాలో ఏదో తెలీని ఆందోళన మొదలయ్యింది.. గబ గబా స్టోర్ షెడ్ దగ్గరికి పరుగు లాంటి నడకతో వెళ్ళేను. నిముషం పాటు నా చుట్టు అంతా చీకటి. పగలే అయినా షెడ్ లోపలా అంతా చీకటే..! ఖాళీ చీకటి..కష్టాల చీకటి..సీతారాముడు చేసిన మోసం అక్కడ చీకటిలా, చిక్కగా పేరుకు పోయింది.

షెడ్ గుమ్మంలో చలనం లేకుండా నిలబడిపోయిన నా భుజాల మీద నుంచి హుస్సేన్ అనుమానంగా అడిగేడు. ''సీతారాముడంటే ముందుగాల నేనచ్చినపుడు ఇక్కడుంటడే..గా పొల్లగాడేన సాబ్..? ఆడు మిమ్మల్ని ముంచిండు సాబ్.. మూడు దినాల కిందట సెంట్రింగు చూసేతందుక్క అచ్చినప్పుడు, కొంచెం బుగులు మీద కనపడ్డడు. ఏమాయెనంటే.. చెల్లె పెండ్లి ఉన్నది.. ఎట్ల చేయాల్నో అన్నడు.. సిమెంటు, స్టీలు మెత్తం అమ్ముకు పోయుంటడు..గంతె.. ఈ దినాల్ల ఇసుమంటి దంద కూడా షురూ అయ్యింది సాబ్.. పోలీసు కంప్లెయింట యితే ఇవ్వుద్రి..మరింక ఈ దినమయితె పని కాదు... రేపు రమ్మంటరా...?'' అని, లేబరు వంక తిరిగి ''నడువుంద్రి.. నడువుంద్రి... నార్సింగ్ లేబర్ను కాంచన్బాగ్ తోల్కపో.. మిక్సర్లు కూడ... శ్రీరాములు సేటు ఇల్లు యాదేకదా''అని పురమాయించేడు. తర్వాత దూరంగా వెళ్ళి ఎవరితోనో ఫోన్లో మాట్లాడటం మొదలు పెట్టేడు.

నా మనస్సు శూన్యమైంది. నా మెదడు గదిలో వెలుగుతున్న దీపాన్ని ఎవరో ఆర్పేసినట్టుగా ఉంది. సెల్‌ఫోన్ జేబులో పెట్టుకుంటూ, వెళ్ళడానికి సిద్దమవుతూ,మరోక్కసారి అడిగేడు హుస్సేన్.

''రేపు మందిని తోల్కరమ్మంటరా..?''

కొంచెం సేపయ్యాక జవాబు చెప్పేను హుస్సేనుకి. ''రేపు వొద్దులే.. తర్వాత ఫోన్ చేస్త..''

''అచ్చా సాబ్'' అని సలాం చేసి అతను వెళ్ళిపోయేడు. నేను మౌనంగా నిలబడి ఉన్నాను.

నాకెందుకో గాని లేత ఎండలో, సెంట్రింగ్ కర్రల సపోర్టుతో నిలబడి, ఇంకా శ్లాబ్ పడని నా ఇల్లు నాతో మాట్లాడుతున్నట్టనిపించింది. ఇల్లంటే, సిమెంటూ,స్టీలూ కాదని, ఇల్లంటే ఇంకేమిటోననీ, ఇంకా రూపం, రంగు ఏర్పడవి నా ఇల్లు నాతో చెపుతున్నట్టనిపించింది. చాలా సేపు నేను ఆ ఇంటినే చూస్తూ ఉండిపోయేను.

తర్వాత చెయ్యాల్సిన పనుల కోసం బైక్ తీస్తున్నపుడు నా మనస్సుకెందుకో ప్రశాంతత కలిగింది.

మా మీసాల ముసలాయన నల్లటి మొహంలో, కళ్ళు గర్వంతో వెలిగి పోతుండగా,కుడి చేత్తో తన తెల్లటి మీసాల్ని కొనలు తిప్పుతున్న దృశ్యం కళ్ళ ముందు కనిపించింది.

పచ్చని పెళ్ళి పందిట్లో, పెళ్ళి కొడుకు పక్కనే, మొగలిపొత్తులాగా ముడుచుకుని కూర్చున్న నా చెల్లాయి రూపం కూడా...!

★